

# చురక / కప్పగంతుల మల్లికార్జునరావు

“రజియా నన్ను రెండో పెళ్ళి చేసుకో మని వేధిస్తోంది. మీరెలాగైనా ఆమె మనసు మార్చాలి. ప్లీజ్....” షాజహాన్ అభ్యర్థన విని నేను సిగ్ధాంత పోయాను!

అంతలోనే భానుమూర్తి తరచు ప్రవచించే వో సిద్ధాంతం హఠాత్తుగా గుర్తు కొచ్చింది.

‘యీ దేశంలో ఆడపిల్లల వివాహ సమస్యకు, కట్నాల గొడవకు, నన్నడిగితే శాశ్వత పరిష్కారం చాలా సింపుల్. ముస్లింలలోలాగ బహు భార్యత్వం లీగలైజ్ చేస్తే చాలు. మన పురాణ యితిహాసాల్లో కథల నీతి అంతా అదే కదా? మహానుభావుడు శ్రీకృష్ణుని మనం ఎందుకు ఆదర్శంగా తీసుకో కూడదు?’

యిలాంటి అవాకుచవాకు సిద్ధాంతాలను సందర్భశుద్ధి లేకుండా పెళ్ళాం దగ్గర చెప్పుకోటం గొప్పగా భావించే భానుమూర్తి నా భర్త.

“మిసెస్ పద్మభానూ. మీరు నా కుటుంబాన్ని నిలబెట్టాలి.”

రోళ్ళొచ్చి మద్దెలతో మొరబెట్టుకొన్న చందం! నా కుటుంబాన్ని ఎలా నిలబెట్టుకోవాలో తెలియక సతమతమవుతున్నాన్నేను.

నేను చెప్తే రజియా వింటుందన్న ఆశ వుంది షాజహాన్‌కు. భానుమూర్తి ఎవరు చెప్పినా విననంత గొప్పవాడే!

అంత ఆవేదనలోనూ నాకో చిలిపి ఆలోచన వచ్చింది.

రజియా కోరికను నేను భానుమూర్తి దగ్గర ఛూచాయగా నా కోరికగా వ్యక్తం చేస్తే చాలు. మరునిముషంలో రెండో పెళ్ళాన్ని తీసుకొస్తాడు. మరి షాజహాన్ ఎందుకింత బాధపడ్తున్నాడు? రజియాను అంతగా ప్రేమించాడా?

"పురుషులు మీరు! స్వయంగా భార్యే రెండోపెళ్లి చేసుకోమంటుంటే మీకు బాధ దేనికండీ? నిక్షేపంగా మరో అందాల భామను చేసుకోక?"

"నన్ను టెస్ట్ చేయకండి. ప్లీజ్"

కళ్లలో తిరిగే నీళ్లను బలవంతంగా షాజహాన్ ఆపుకోటం గమనించాను. మనసు అర్ధమయింది.

"సారీ మిస్టర్ షాజహాన్. రజియాను రేపే కల్సి మాట్లాడుతానుగా? మీరు నిశ్చింతంగా వుండండి."

• • •

షాజహాన్‌కు అలా అభయమివ్వ గలంతటి స్నేహంవుంది రజియాతో నాకు.

మతవిషయంగానే కాక అనేక అంశాలలో, ఆ రోజుల్లో, మా రెండు కుటుంబాల జీవనసరళిలో వ్యత్యాసం స్పష్టంగా కనబడేది నాకు.

రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం మాది. చిన్న కుటుంబం కనుక మా నాన్న దరిద్రాన్ని తెర వెనకనే వుంచి పైకి గుంభనంగా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు.

రజియా తండ్రి ముబారక్‌షా వో పిల్ల అఫీసరు. అయినా నవాబులదర్జాతో యిల్లు వెలిగిపోతుండేది. ముగ్గురు భార్యల్ని చేసుకొన్నాడు. అందులో యిద్దరు పెళ్లాలద్వారా బోలెడంతమంది పిల్లల్ని కన్నాడు. యింకో ఆమెకు బోలెడంత డబ్బిచ్చి విడాకులిచ్చి పంపేశాడు. నౌకర్లు- చాకర్లు, వంటచేస్తూ యింట్లోనే పడివుండే 'మామా' లు.... అతిథులు.... అభ్యాగతులు.... అత్తర్లు పన్నీరు.... విందులు వినోదాలు.... గానాబజానాలు.... పాన్ ఖర్చే వందల్లో వుంటుందని గొప్పగా చెప్పుకునేది రజియాసుల్తానా.

యింట్లో 'మామా' లతో సహా స్త్రీలంతా పరదా సంప్రదాయాన్ని పాటించే వారు. అయినా పిల్లల విషయంలో ముబారక్‌షా ఆధునిక దృక్పథం అవలంబించాడు. స్వేచ్ఛగా తిరగ నిచ్చాడు. ఆడపిల్లలకు సైతం ఇంగ్లీషు చదువు చెప్పించాడు.

నేను, రజియా, డిగ్రీ తీసుకొనేనాటికి ముబారక్‌షా జోరు తగ్గింది. ఆర్థిక వత్తిడులు ఆ యింటి జీవనవిధానాన్ని మార్చివేశేయి. ఆయన దృక్పథం మారింది. ఎదిగొచ్చిన పిల్లలకు మెల్లగా దొరికిన వుద్యోగాలిప్పించుకొని రిటైర్ అయిపోయాడు.

రజియాకి యమ్మే చరిత్ర చదివి లెక్చరర్ కావాలని కోరిక. కనీసం బియిడి చదివి టీచరన్నా కాలేకపోవటంతో నిరాశపడిపోయింది. యిష్టంలేని గుమాస్తా అయింది.

మా నాన్న మొదటినుంచి నా చదువు వుద్యోగాలకన్నా వివాహానికే ప్రాధాన్యత నిచ్చాడు. అంచేత పై చదువుల ప్రసక్తి లేకపోయింది.

గుమాస్తాగా చేరి ఆరునెలలు తిరగకముందే నేను భానుమూర్తికి భార్యనయ్యాను.

"ఆఫీసర్ని భర్తగా కొట్టేశావ్. లక్కీగాల్వే నువ్వు." రజియానే కాదు చాలామంది పెళ్లిరోజు యిదే మాట అన్నారు. నేనూ నా అదృష్టానికి గర్వించాను.

ముచ్చటగా మూడు రాత్రులయ్యాక నాలుగోరోజు హఠాత్తుగా భానుమూర్తి నన్నో ప్రశ్న అడిగేడు.

"వరుల మార్కెట్లో నా విలువ జాస్తి అని నీకు తెల్సే వుంటుంది. చదువుకొన్నదానివి కదా? అయినా నిన్నెందుకు పెళ్లిచేసుకొన్నానంటావ్? ....మీ నాన్న యిచ్చిన ముష్టి కట్నాన్ని ఆశించి అనుకోటంలేదు కదా నువ్వు కూడా," "లేదు"

"మరెందుకనుకొంటున్నావ్?"

"నాకెలా తెలుస్తుంది? మీరే చెప్పాలి."

"నేను విద్యావంతుడిని. ఆఫీసర్ని. అందగాడిని. ఉన్నతాభిరుచులు వున్నవాడిని. ఆ అభిరుచుల్లో వొకటి అందం పట్ల నాకు గల ప్రేమ, అభిమానం. అర్థమయిందిగా - నీ అందాన్ని చూచి మోజు పడ్డానని అర్థం. దాన్ని నువ్వు 'ప్రేమ' అని పిలుస్తానంటే నా కభ్యంతరంలేదు. అయితే సృష్టిలో బోలెడంత సౌందర్య సంపద వుందిగదా? దాన్నంతా కూడా నేను ప్రేమిస్తాను. ఆరాధిస్తాను. అనుభవించాలని ఆరాటపడ్తాను. అది నా సిద్ధాంతం. అందుకు నువ్వు నాకు చేయూత నిస్తావని, ఆవరోధం కావన్న మంచిభావన నిన్ను చూడగానే కలిగింది. అఫ్కోర్స్.... 'ఫేస్ రీడింగ్'లో నాకాస్త ప్రవేశం వుంది. ఏం ఐ కరెక్ట్?"

అమాయకంగా తలూపేను. 'గుడ్ గాల్' అంటూ దగ్గరికి తీసుకొంటే పొంగిపోయాను కాని ఆయన మాటల్లో అంతరార్థాలు, గూఢభావాలు గ్రహించలేదు. వాటిని నేను గ్రహించేలా చేయటానికి భానుమూర్తికి ఎంతోకాలం పట్టలేదు.

ఆత్మాశ్రయ ప్రవృత్తి అతనిది. అతని మనస్సు వాంఛలపుట్ట. సెక్సు విషయంలో వొట్టి సేడిస్ట్. మనసు, శరీరం ఎప్పుడు ఏమికోరుకొంటే అవి వెంటనే సరఫరా కావాలి. నిగ్రహం లేదు. ఉచ్చనీచాలు, మంచిచెడ్డలు, నీతినియమాలు

వొట్టి 'బూర్జువా' మాటలని ఎగతాళిచేసి పారేస్తాడు. తన బలహీనతల్ని గొప్ప ఆదర్శాలుగా చెప్పి చెలామణీచేయించుకో గల కళలో నిపుణుడు.

ఆఫీసర్ భార్య నయ్యాక గుమాస్తా వుద్యోగాన్ని మానేస్తానని అనుకొన్నా రందరూ. కానీ భానుమూర్తి అందుకు అంగీకరించలేదు.

"ఏం ? అంత సుకుమారివా నువ్వు ? కాక గుమాస్తా వుద్యోగం 'మన' హోదాకు తక్కువా ? మగాడి సంపా దన మీద భార్యలు బతికే కాలం వెళ్లి పోయింది. సోషలిస్టు సమాజంలో జీవి స్తున్నాం మనం, గుర్తుంచుకో. అందరు కష్టపడ్తేనే దేశప్రగతి." అతని వాక్చా తుర్య 'కళ' కు అదో మచ్చు తునక. అలా మాట్లాడటం గొప్పగా భావిస్తాడు.

రెండు చేతులు కలిస్తే శబ్దమే ! యింటి గుట్టు రచ్చకెక్కించుకోటం ఏం లాభం ? పైగా స్వభావసిద్ధంగా నేను ఇన్‌ట్రావర్ట్‌నేమో ! రజియాసుల్తాన్ లాగా బడబడా వాగేసే తత్వం కాదు.

నాకుపెళ్లయ్యాక రజియాకు కూడా 'పెళ్లి పిచ్చి' పట్టుకొంది. ఆఫీసులో, బస్‌స్టాపుల వద్ద తనను ప్రేమించే 'నిరుద్యోగిమండల' 'గుమాస్తాగొర్రెల' కబుర్లు చెప్పటానికి తరచూ మా ఆఫీసు కొచ్చేది. అలాంటి సందర్భాలలో వో రోజు ఆమె షాజహాన్ కంట్లో పడింది.

షాజహాన్‌కు ఆఫీసులో మంచి పేరుంది. అందగాడు. తెలివిగలవాడు. అయినా తన పనేమిటో తానేమిటో ?

"మేడం. మీనుంచి నాకో హెల్ప్ కావాలి" అన్నాడో రోజు. అప్పుడే తెల్సింది అతను రజియాను ప్రేమిస్తున్నా డని. రజియాకన్నా నిజానికి ఎందులోనూ తీసిపోడు షాజహాన్. రజియా పెద్ద రంభేమీ కాదు. అయినా దాని స్వభావం కోరికలు నాకు తెల్సు.

"నీకు ఆఫీసర్ మొగుడు. నాకు గుమాస్తానా ? నేను ఆఫీసర్‌ని తప్ప చేసుకోను" అని అనేయగలదు. అంచేత షాజహాన్‌కు దాన్ని పరిచయంచేసేను. నేను వూహించినట్లే అయింది.

"అతను నన్ను పెళ్లిచేసుకోమని పోరుపెడ్తున్నాడే."

"ఎవరు ?"

"ఎంత నంగనాచివే ! ఏం తెలియ దన్నట్లు అడుగుతున్నావ్. పరిచయం చేసేవుగా 'పెద్ద గుమాస్తా' మనిషిని !"

"అయితే షాజహాన్‌గారు నీలో ముంతాంజ్‌మహల్ సౌందర్యాన్ని చూచారన్నమాట !"

"ఆపవే ఆ అర్థంలేని కబుర్లు ! పేరులో తప్ప షాజహాన్ చక్రవర్తి నా కతడలో ఏ కోశానా కన్పించడే !"

"అతనికేమే. అందంగా...."

"అందం – గాడిదగుడ్డు. షాజహాన్ చక్రవర్తి అందంగా వున్నాడో లేదో నువ్వు చూచొచ్చావా ? అతడికి బోలె

డంత సిరిసంపద లుండేవి. యీాయన గారికి యీాడిసీ వుద్యోగంతప్ప మరేం లేదే ?

"వోసీ మీ వాళ్లు ఏ కలెక్టరునో తెస్తారేమో చూడు"


నిట్టూర్చింది. ఎగతాళిగా– "యీ మాత్రం గుమాస్తాను కూడా తేలేరు మావాళ్లు. మాలోనూ పద్ధతులు మారి పొయాయ్. ఆడదానికి డబ్బిచ్చేవారు పూర్వం. యిప్పుడు వరకట్నాలు అడుగుతున్నారు మీలో లాగే"

మొత్తంమీద షాజహాన్‌ను వూరించి వూరించి, చుట్టూ తిప్పుకొని, సవాలక్ష కండిషన్లు పెట్టి, అవి షాజహాన్ అంగీకరించాక, అతడితో పెండ్లికి అంగీకరించింది రజియా.

అతను ముస్లిం పర్సనల్ లా ముసుగులో మరో పెళ్లి చేసుకోకూడదు. తనకు విడాకులిస్తా ననకూడదు. ఆమె పెట్టిన కండిషన్లలో వొకటి యిది.

అలాంటి రజియా భర్తను రెండో పెళ్లి చేసుకోమంటోంది ?!

"ఆదివారం పూట ఆఫీసరు మొగుడిని వదిలేసి పద్మభానుమహారాణిగారు నోటీసు యివ్వకుండా మా మురికికూపానికి వచ్చారంటే ఏదో పెద్ద విశేషం వుందన్నమాటే !" పాత బట్టల్తో, చెదిరిన చింపిరి జుట్టుతో, మురికి చేతుల్తో, చిరాకు మొహంతో వున్న రజియా, నన్ను ఆహ్వానించిన పద్ధతి అది.



ఆఫీసరు భర్తతో నేను మహారాణి భోగాలు అనుభవిస్తున్నానని దాని వూహ ! ఆ ధోరణిలో నన్ను గురించి తెగ వూహిస్తుందది

"వచ్చేసరికి ఎవరి మీదే చిరాకు పడ్తున్నావ్ ?"

"రాష్ట్రపతి, ప్రధానమంత్రుల మీద! ఎవరిమీద చిరాకులు పడ్తే ఎవరూరుకొంటారే ! నా మీద నేనే చిరాకు పడ్తున్నా. నా జీవితాన్ని నేనే అసహ్యించుకొంటున్నా. ఏం ? అదీ నేరమేనా !"

దాని ముగ్గురు పిల్లలు బిక్క మొహాలతో నిల్చొనివుంటే దగ్గరికి తీసి పలకరించాను. బిస్కెట్లు, చాకెట్లు యిచ్చాను. తల్లి చివాట్లను మర్చిపోయి ఆడుకోటానికి హుషారుగా వెళ్లేరు వాళ్లు

"షాజహాన్‌గారు ఎక్కడికో వెళ్లినట్లుందే?"

ఎగతాళిగా నవ్వింది రజియా. "అయన వెళ్లటమా? నన్నొదిలి? అలనాటి షాజహాన్‌గారు పెళ్లాం తనని వదిలేసి వెళ్లిపోయినా డబ్బుంది కనుక 'ప్రేమ'తో తాజ్‌మహల్ కట్టించాడు. యీ షాజహాన్‌గారికి 'ప్రేమ ప్రేమ' అని పెళ్లాంకొంగుపట్టుకు తిరగటంతప్ప మరేం చేతకాదు. 'గొర్రెతోక' గుమాస్తాలకి క్లబ్బులు, సర్దాలు వుండవు కదా? నా భర్తా ఆఫీసరవుతే నేనూ నీలాగా షికార్లు చేసేదాన్నే. 'ఆదివారమన్నా నన్ను పనిచేసుకోనియ్యవయ్యా మగడా' అని యింతకు ముందే తరిమేను యింట్లోనుంచి. అయినా ఎంతసేపులే. యిప్పుడు రాడూ? 'ప్రేమ'ట అది!'

అది హేళనచేసే షాజహాన్ ప్రేమను తల్చుకొంటే నాకు దానిపట్ల అసూయ కలిగింది. నా నిర్భాగ్యస్థితి గుర్తుకొచ్చిది.

"యీ పూట యిక్కడే రాణిగారి భోజనం. అభ్యంతరమా?"

ఇంటిపనిలో దానికి సహాయం చేసేను. మొదటినుంచి పనులు చేసుకొనే అలవాటు లేకపోవటంవల్ల పూరికే హైరానా పడిపోతుంది కాని యింట్లో ఏమంత పెద్ద పనిలేదు.

స్నానంచేసి మంచి బట్టలు కట్టుకొంది. జడవేస్తుండగా యిద్దరి మొహాలు అద్దంలో ప్రతిబింబించాయి.

రజియాలో ఏమంత అందముందని అందగాడైన షాజహాన్ ఆమెనంతగా ప్రేమిస్తున్నాడు?

'తనవద్ద ఇంత అందమున్నా భానుమూర్తి ఎక్కడెక్కడో, ఎవరిలోనో సౌందర్యాన్వేషణ నెందుకు చేస్తున్నాడు?'

ప్రేమించే భర్తను రజియా ఎందుకు మరో పెళ్లి చేసుకోమంటోంది?

భర్త 'కుక్క' స్వభావం తెల్పి తనెందుకాతడిని గుట్టుచప్పుడుకాకుండా భరిస్తోంది?

ఇంట్లోనూ, యిద్దరి మనసుల్లోనూ ప్రశాంత వాతావరణం ఏర్పడ్డాక రజియాను మెల్లగా అసలు విషయంలోకి లాక్కెళ్లేను.

"నిజమే. నీతో చెప్పుకొన్నాడా? యిందులో నువ్వనుకొంటున్నట్లు పిచ్చీ లేదు - తప్పూలేదు. మా మతం బహుభార్యాత్వాన్ని అంగీకరిస్తుంది కదా?"

'మతం గురించి కాదు నేను మాట్లాడుతోంది. నీ జీవితాన్ని గురించి బహుభార్యాత్వపు ఆచారాన్ని మీ మతంవారు ఏ చారిత్రక పరిస్థితుల్లో కుటుంబ ధర్మంగా ప్రవేశపెట్టేరో మనం




చరిత్రలో చదవలేదా? ఆనాటి సామాజిక స్థితి యీనాడేదీ? స్త్రీవి అయివుండి ఆ ఆచారాన్ని ఎందుకు సమర్థిస్తావ్?" గట్టిగానే అన్నాను. అయినా మనసు ఎందుకో తడబడింది.

ఒక భార్య - ఒక భర్త అన్నదీ ఆచారమేగా? దాన్ని పట్టుకొని తాను ఎందుకు వ్రేలాడుతోంది? విడాకులు అంటే ఎగిరి గంతేస్తాడే భానుమూర్తి? తాను ఎందుకు ఆపని చేయలేకపోతుంది?

బాబు.... భవిష్యత్తు.... ఆలోచనా మాత్రంగానే దడ!

"స్త్రీగా ఆలోచించటంలేదే నేను నా సమస్యని. మనిషి - మనిషిగా ఆలోచిస్తున్నాను. నా స్థితి తెల్సుకొని నువ్వూ అలాగే ఆలోచించు.

"ప్రొద్దున యిల్లు, పిల్లలు - చాకిరీ, అధికార్లు - చాకిరీ. సాయంకాలం మళ్ళీ యిల్లు, పిల్లలు - చాకిరీ. గొడ్డునా? మధ్యయుగపు బానిసనా?

"శారీరకసుఖం. విశ్రాంతి వుంటేనే ప్రేమలో మాధుర్యం తెల్సేది." రజియా బాధ నాకర్థమయింది.

కానీ రేపు షాజహాన్ ఎవతినో చేసుకుని కులుకుతుంటే మానసికంగా సహించి వూరుకోగలదా?

"ఆ ఎందుకంటే నా సవతి నాకు, నా బిడ్డలకి, భర్తకి సేవచేస్తుంది కనుక. ఆ సేవవిలువగా నా భర్తను సవతితో పంచుకోగలను."

చాకిరీకోసం భర్తని మరో స్త్రీతో పంచుకోవటమా? ఆలోచనే వెగటు వేసింది. ఛీ...."

"ఎలుకలున్నాయని యింటికి చిచ్చు పెట్టుకున్నట్లుంది నీ ధోరణి. రేపు నీ సవతికి పిల్లలు పుడ్తారు. అదీ నీలాగే మరో సవతిని తెచ్చుకోమని పోరు బెట్టుంది నీ భర్తను. మళ్లీ వాళ్లకి పిల్లలు. 'మామా'ను పెట్టుకొంటే పోయేద్దానికి - మధ్యయుగంలో ముస్లిం స్త్రీలా ఆలోచిస్తున్నావ్ ?"

"ఆఫీసర్ మొగుడు, నౌకర్లు చాకర్లు గలదానివి- ఎన్ని నీతులైనా చెప్తావ్ నాకు. నా బాధ అనుభవిస్తే తెలుస్తుంది. ఏ యుగంలో జీవిస్తున్నాం, ఆలోచిస్తున్నాం అన్నాదానికి కొలమానం ఏమిటి? నీకు కాలం- అన్నీ వున్నదానివి కనుక. నాకు డబ్బు - నా ఆర్థిక స్థితి - నా అవసరాలు."

ఉద్రేకంగా అంది. దాన్ని వాదన ద్వారా మార్చటం శక్యంకాదు. నేను ఏం చెప్పినా వినదు. ఎందుకంటే దాని దృష్టిలో నేను సుఖపడే వర్గంలో వున్నాను.

దాని మనసు మార్చాలంటే నా కథ- నా బాధ చెప్పుకోక తప్పదు.

చెప్పేను.

'పశుపక్ష్యాదులనుండి మనిషిని వున్నతుడిని చేసేది మనసే. డబ్బుతో భౌతిక సుఖాలు కొనుక్కోవచ్చు. కాని మానసిక శాంతిని ఎలా కొనుక్కోటం?'

రజియా కాస్సేపు మాట్లాడలేదు. దాని మొహంలో సానుభూతి - నా పట్ల జాలి!

"సో.- భౌతిక మానసిక బాధల్లో స్త్రీ వేటిని భరించటం కష్టం? ఏ అవసరాలు ముఖ్యం? యివేనా నీ ప్రశ్నలు ?"

"ప్రశ్నలూ లేవు - నీ సమాధానాలు అక్కర్లేదు నాకు. కొద్దిపాటి భౌతిక సుఖాలకోసం ఘోరమైన మానసిక సమస్యల్ని సృష్టించుకోకు అన్నదే నా సలహా."

"అంగీకరిస్తాను. ఎందుకంటే నా భర్త తరపున వచ్చిన రాయబారివి నువ్వు. రాయబారిని గౌరవించటం మర్యాద. అయితే వొక్క మనవి. నీ తరపున నేను నీ భర్తతో రాయబారం చేయటానికి అంగీకరిస్తావా ?"

యిదేమిటి? కథ అడ్డం తిరగదు కదా? భానుమూర్తి దీని రాయబారాన్ని 'కేర్' చేస్తాడా? పైగా వొంటరిగా అది కలిస్తే....నో నో....

"ఎగతాళి కాదు. సీరియస్‌గా మాట్లాడుతున్నాను నేను."

"చిత్తం. మేమూ యికపై అలాగే మాట్లాడుతాం త్యాగశీలిగారు." ఎగతాళిగా అని అంతలోనే సీరియస్ అయింది రజియా.

"మీ రాయబారాన్ని అంగీకరించాం పద్మభానుగారూ. షాజహాన్ అనే నా భర్తను రెండో పెళ్లి చేసుకోమని పోరు బెట్టను. అతనే చేసుకొంటానన్నా ప్రతిఘటిస్తాను. అయితే అందుకు ప్రతిగా వొక్క కండిషన్. అదేమంటే-మిసెస్

పద్మభానుగారు తన భర్తకు విడాకు లివ్వాలి."

"రజియా" కోపంవచ్చింది నాకు నిజంగానే.

"తగ్గు. అరవకు. ఆచరణ-సిద్ధాంతం చెప్పినంత సులభం కాదని తెల్సుకో. మా మతసంప్రదాయాలు అంగీకరించినా, ప్రేమవున్న మా యిద్దర్నీ కల్సి జీవించమని సలహాయివ్వటం నీకు తప్పుగా తోచలేదు. ప్రేమలేని మిమ్మల్ని, మీ సంప్రదాయాన్ని కాస్తంత సడలించుకొని, ఆధునిక చట్టాలు కల్పించిన సౌకర్యాన్నివుపయోగించుకొని,విడిపోయి ఎవరి దోవన వాళ్లని బ్రతకమని నేను సలహాయివ్వటం ఎలా తప్పుగా తోస్తోంది నీకు? అంత వులిక్కిపడ్డావు-పాపం! మాట అన్నంత మాత్రానే నీ పాతివ్రత్యానికి భంగం వచ్చిందా?"

పాతివ్రత్యం! నా తాపత్రయం-బాబు భవిష్యత్తు కోసం కాదూ?

ఆత్మశోధన - మధనం - ఆరంభమయింది.

భానుమూర్తి భార్యగా వుండటంవల్ల నాకు ఆర్థికలాభం ఎప్పుడో పోయింది. సామాజిక రక్షణ అంతంత మాత్రం! కాగా అవినీతిమార్గాలు నాకూ నూరిపోసేవాడు-అయినా అతని ఆగడాలను ఎందుకు సహించాను? బాబుకోసం. నిజమే - వొకప్పుడు.

కానీ యిప్పుడు బాబుకు వూహ తెలుస్తోంది. భానుమూర్తి ప్రభావం అతనిమీద పడ్తోంది. ఆ భయం తన్ని.మానసికంగా చిత్రహింస చేస్తోంది.

అయినా అతనికి భార్యగా అణగిమణిగి ఎందుకు పడివుంటోంది తను? భానుమూర్తి నుంచి విడిపోయి బాబు భవిష్యత్తును నిర్మల వాతావరణంలో తీర్చిదిద్దవచ్చుగా?

రజియా చూపుల్లో 'ఛాలెంజ్' కన్పించింది. నాకు ఆవేశం, పట్టుదల ముంచుకొచ్చాయి. అదేమో మాట్లాడబోయింది. ఆ అవకాశం యివ్వకుండా ధృఢస్వరంతో గబగబా అన్నాను.

"ఆల్‌రైట్. నీ కండిషన్‌ను నేను అంగీకరిస్తున్నా. నువ్వు మటుకు మాట తప్పితే వూరుకోను."

* * *

నా అంచనా తప్పయింది. భానుమూర్తి నా నిర్ణయాన్ని విని ఎగిరి గంతేయలేదు. మత్తు దిగిపోయింది. మామూలు మనిషిలా ఆశ్చర్యపోయాడు! "ఆర్ యు క్రేజీ!!" అన్నాడు-నా మొహంలోకి స్టడీచేస్తున్నట్లు చూస్తూ

ఆ స్థితిలో భానుమూర్తిని చూస్తుంటే నాకు గొప్ప సర్దాగా వుంది. అతనిపై దాడిని వుధృతం చేసేను. బలహీనులపై బలవంతులు స్వారిచేసేది యీ థ్రిల్ కోసమేనేమో.

"బాబు సాకుతో నన్ను బలహీనురాలిని చేద్దామనుకొంటున్నారేమో!

అదేం కుదరదు. కావాలంటే వాడిని మీ దగ్గరే వుంచుకోండి. వొక్క నెల మాత్రమే 'టైం' యిస్తున్నా. విడాకులకి ఏర్పాట్లు చేయండి. లేదా పిచ్చిపిచ్చి అలవాట్లు మాని బుద్ధిగా యింట్లో పడుండండి. అవది తెగిస్తే ఏమైనా చేయగలదు. టేక్ కేర్."

నా 'అల్టిమేటం' కు అంత గొప్ప శక్తి వుంటుందని నేననుకోలేదు. ఆఫీసు- యిల్లు. వూరికుక్క- నుంచి భానుమూర్తి యింటికుక్కగా మారేడు. బాబుకి చదువుతోపాటు బుద్ధులు, నీతులు చెప్తున్నాడు. నన్ను ప్రసన్నంచేసుకోటానికేనా యిదంతా? అహా! ఏమి మార్పు? కాక నటనా?

"నీ కేమన్నా పిచ్చిపట్టిందా? యిన్నేళ్లు కాపురంచేసి యిప్పుడు విడాకులేమిటి? చేతులారా కుటుంబ జీవితాన్ని నాశనంచేస్తానంటావేం?

"పశుపక్ష్యాదులకు కూడా పగలంతా ఎక్కడ తిరిగినా రాత్రికి గూడు, తన వాళ్ల తోడు అన్నవి కావాలి. అవన్నీ వున్న నన్ను వాటిని వదులుకోమంటావేమిటి!"

"యీ బుద్ధి యిన్నాళ్లు ఎక్కడికి పోయిందో?"

"ఎక్కడికి పోతేనేం? యిప్పుడు వచ్చిందిగా? యిక మారితే అప్పుడడుగు విడాకులు."

భానుమూర్తిని యింకెలా బలవంతం చెయ్యను? మరి విడాకులిస్తానని రజియా వద్ద అంగీకరించి వచ్చానే? నేనుకూడా తప్పేనని తనూ తప్పితే?

పాపం షాజహాన్! మనసులో జాలే! కాని అతని సంసారం చక్కదిద్దటంకోసం చక్కబడ్తున్న తన సంసారజీవితంలో చిచ్చుపెట్టుకోటం మూర్ఖత్వం కాదూ.


ఆఫీసులో అతను ఎదురుపడ్డా తప్పుకు తిరిగేను. భయం- సిగ్గు! అయినా వుత్కంఠ! రజియా ఏం గొడవ పెడ్తోందో అతడిని? తగుదునమ్మా అని రాయబారిపాత్ర వహిస్తిని!!

తెగించి వో రోజు "రజియా ఏమంటోంది?" అని అడిగేను.

"మీరుగా ఆ ప్రశ్న అడిగితే యీ వుత్తరం యివ్వమంది."

తీసుకుని చదివేను.

'మరీ మంచితనం చాతకానితనానికి మారుపేరని చరిత్ర చెప్తున్న సత్యం. లేనివాడిని వున్నవాడు, బుద్ధిహీనుడిని మేధావి, బలహీనుడిని బలవంతులు రకరకాల దోపిడీలు చేస్తారని అందరికీ తెల్సు. కాని సంసారంలో మంచి భార్యల్ని భర్తలు, మంచి భర్తల్ని భార్యలు 'ఎక్స్‌ప్లాయిట్' చేస్తారని తెలీదు చాలామందికి. సంసార రథం సజవుగా నడవాలంటే భార్యాభర్తలనే గుర్రాలు సమవుజ్జీలుగా పరుగెత్తాలి. అప్పుడే ఆ రథాన్ని నమ్ముకొన్న బిడ్డలనే ప్రయాణీకులకు సుఖశాంతులు. ఏ




గుర్రం కొంత మెతకదైనా రెండో గుర్రం విజృంభించి రథాన్ని అడ్డదారుల్లోకి లాక్కెళ్తుంది. అప్పుడు మెతక గుర్రానికి వో చెన్నాకోలు చురకబడ్తే కోపంతో విజృంభిస్తుంది.

'నువ్వో చిన్న నాటకం ఆడి మా పెళ్లిచేసేవు. ప్రతిఫలంగా కొంచెం పెద్ద నాటకం ఆడక తప్పలేదు. చెన్నాకోలుచురకను జీవితాంతం గుర్తుంచుకో'

చురుగ్గా షాజహాన్ వైపు చూచాను.

"మీ రాయబారానికి కృతజ్ఞతలు" నవ్వుతూ అన్నాడు.

"తోడుదొంగ అన్నమాట!"

"ఆ- ఎప్పటికీ మీకు తోడుండే దొంగలం."

రజియా ఎదురుగ్గా వుంటే కావలించుకొని ముద్దులు పెట్టుకోవాలన్నంత కోపం వచ్చింది. కానీ ఎదురుగ్గా వుంది షాజహాన్ ఆయె! ఏం చేయను?